
మహానందీశుని ఉత్సవాలకు వేళాయే..!

- నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- 24న అంకురార్పణ, 24న ధ్వజారోహణం
- 26న మహా లింగోద్భవం, 28న మహా రథోత్సవం


మహానంది క్షేత్రం


మహానందీశ్వరస్వామి

మహానంది: మహానందీశ్వరుడి ఉత్సవాలకు వేళైంది. నల్లమలలో కొలువైన మహానందీశ్వరుడి సన్నిధిలో మహాశివరాత్రి పండుగ సందడి కనిపిస్తోంది. ఆధ్యాత్మికత, ఆనందానికి నెలవై, శివకేశవులు కొలువైన మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులు నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయానికి వెళ్లి పెళ్లి పెద్ద పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి వార్లతో కలిసి 23న మహానందికి చేరుకుంటారు. దీంతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

24న ఉత్సవాలకు అంకురార్పణ

మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 24న అంకురార్పణ పూజలు చేయనున్నట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 24న అనుజ్ఞ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరార్చనలు, ఋత్విగ్వరణ, దీక్షా ధారణ సంకల్పం పూజల అనంతరం వాస్తుశాంతి, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ట సాయంత్రం ధ్వజారోహణం ఉంటుందన్నారు. అదేరోజు రాత్రి మహానందీశుడి దంపతులకు మయూర వాహన సేవ ఉంటుందని చెప్పారు. 25న నాలుగు కాలార్చన పూజలు, ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

26న మహాలింగోద్భవం

మహాశివరాత్రి పురస్కరించుకుని 26న ఉదయం రావణవాహనంపై గ్రామోత్సవం, రాత్రి నందివాహనంపై ఉత్సవాలు ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల నుంచి మహానందీశ్వరుడికి లింగోద్భవం కాలంలో మహారుద్రాభిషేకం, తెల్లవారుజామున(తెలవారితే 27) స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం కనుల పండువగా చేయనున్నామన్నారు. 27న స్వామివారికి ఉదయం శేషవాహన సేవ, రాత్రి పుష్పపల్లకీసేవలు ఉంటాయని తెలిపారు.

28న మహా రథోత్సవం

మహానందిలో ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి యాగశాల పూజలు, రథాంగ హోమాలు, బలిహరణలు, అశ్వవాహన సేవ పూజల అనంతరం సాయంత్రం 3 గంటల నుంచి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. మార్చి 1న చివరి రోజు ఉత్సవ పూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, మూలమూర్తులకు పూర్ణాభిషేకం, త్రిశూల స్నానం, ధ్వజ అవరోహణము, సాయంత్రం మహదాశ్వీరచనం, తెప్పోత్సవం, పండిత సత్కారంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

– రూ.86 వేల రికవరీ

పాములపాడు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్ పనులపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన బహిరంగా సామాజిక తనిఖీ వేదికలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీనాయక్, ఏపీడీ అన్వరాబేగం సమక్షంలో సోషల్ ఆడిట్ బృందం వివరాలు వెల్లడించారు. మండలంలో 708 రకాల పనులకు గాను రూ.9,97,06,724 ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పనుల్లో అవినీతి జరిగినట్లు తేల్చి రూ.86,000 రికవరీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, అధికారులు షీభారాణి, గంగాధర్, రాఘవేంద్రప్రసాద్, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు రుణాలు మంజూరు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా చిరు వ్యాపారాలు చేసుకునేందుకు శ్రీశైలం ఐటీడీఏ తరపున శుక్రవారం ఆర్థిక రుణాలను ఇప్పించారు. హఠకేశ్వరం చెంచుగిరిజన గూడెంలోని 9 మంది గిరిజనులకు రూ..20,000 చొప్పున ఆర్థిక రుణాలను యూనియన్ బ్యాంక్ అధికారులు మంజూరు చేశారు. శ్రీశైలం క్షేత్ర పరిధిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఐటీడీఏ అధికారి ధనుంజయ సూచించారు.

క్లుప్తంగా

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు

ఆత్మకూరు: క్రమశిక్షణతో చదవి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ జీవితంలో ఎతో క్లిష్ట దశ అన్నారు. మంచి, చెడులు ఆకర్షిస్తాయన్నారు. చెడు వైపు వెళ్తే జీవితం అంధకారమవుతుందన్నారు. మంచి మార్గంలో నడిచి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు ముందుగా శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి


విద్యార్థులకు ప్లేట్లను అందజేస్తున్న మేనేజర్ పాండురంగనాయక్

ఆత్మకూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భావిభారత పౌరులుగా ఎదగాలని ఎల్ఐసీ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఆయన భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాండురంగనాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు జవహర్‌నాయక్, హెచ్ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆత్మకూరు: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బైర్లూటీగూడెంలో గిరిజనులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపం, ధూమపానం, మద్యపానం, గుట్కా, ఖైనీ అలవాటు ఉన్న వారికి క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. గళ్ల పరీక్షలు చేయించుకుని క్షయ వ్యాధి ఉన్నట్లు తేలితే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఉచిత మందులతోపాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ.1,000 చొప్పున ఆరు నెలలపాటు బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ జబీబుల్లా, ఎంఎల్‌హెచ్‌పీ దీపిక పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తిచేయాలి


సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ4 సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం నందికుంట, బావాపురం, దుద్యాల, కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ4 సర్వేను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ మేరి తెలిపారు. మండలంలో 725 మంది బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


తెలుగు తల్లి విగ్రహం వద్ద యూనివర్సిటీ డీన్, అధ్యాపకులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (చరిత్ర సంస్కృతి పురావస్తు శాఖ పీఠం)లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ డీన్ మునుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యాపక బృందం తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ తెలుగు భాషకు ఎంతో ఘన చరిత్ర కలిగి ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు, చంద్రగుప్త మహారాజు, విక్రమాదిత్యుడు, రెడ్డి రాజులు పరిపాలించిన సమయంలో తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.

సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


మాట్లాడుతున్న డాక్టర్ ఎం.పద్మ

శ్రీశైలంప్రాజెక్ట్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం పద్మ మాట్లాడారు. జీవితంలో మనిషి ఏ స్థాయిలో ఉన్నా కన్న తల్లిని మరచిపోలేనట్లు, మాతృభాషను కూడా మరవకూడదన్నారు. సదస్సులో అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, కళ్యాణి, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఉద్యాన మేళా

మహానంది: మహానంది సమీపంలోని ఎంసీ ఫారం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో శనివారం ఉద్యాన మేళా నిర్వహించనున్నట్లు హెచ్ఆర్ఎస్ హెడ్ సైంటిస్ట్ డాక్టర్ ముత్యాల నాయుడు, సీనియర్ శాస్త్రవేత్త ఠాగూర్ నాయక్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో మెరుగైన పంట సాంకేతికతలను చర్చించడానికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.గోపాల్, ఉద్యాన పంటల నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు.

కేజీబీవీ తనిఖీ

బండి ఆత్మకూరు: జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అదనపు అధికారి, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి ప్రేమంత్ కుమార్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. వసతులు, బోధనా విధానాన్ని, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి, చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బోధన విధానాలపై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి లలితకుమారి, జిల్లా బాలికల సంక్షేమ అభివృద్ధి అధికారి సువర్చల, జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల అధికారి కె.రఘురామి రెడ్డి, ఎంఈఓలు యశోద, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులతో దర్గా ప్రాంగణం కిక్కిరిసింది. కాయ, కర్పూరాలు సమర్పించారు. ఖవ్వాలి అలరించింది. ముజావర్ బాదుల్లాసాహెబ్ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వైపు వెళ్లే మార్గంలో వ్యవసాయ కళాశాల వరకు మూడు కిలోమీటర్ల దారి గుంతలు పడి అధ్వానంగా ఉండేది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రహదారులు, భవనాల శాఖ అధికారులు శుక్రవారం రహదారి మరమ్మతులు ప్రారంభించారు. కాగా రహదారి, పాలేరుపై వంతెనకు రూ.7కోట్లకు పైగా నిధులు మంజూరైనా అటవీశాఖ అధికారుల సర్వే పేరుతో అర్ధాంతరంగా ఆగిపోయింది.

సర్వే తనిఖీ

జూపాడుబంగ్లా: మండ్లెం గ్రామంలో జరుగుతున్న పీ4 సర్వేను శుక్రవారం ఎంపీడీఓ గోపీకృష్ణ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా పేదరికంలో ఉన్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: 2025–26 విద్యాసంవత్సరానికి మోడల్‌పాఠశాల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు మార్చి 20లోగా రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75ల చొప్పున పరీక్షా రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

శివభక్తులకు అన్నదాన శిబిరాలు


శివస్వాములకు అన్నదానం చేస్తున్న దాతలు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాలినడకన శ్రీశైలం వెళ్తున్న భక్తుల శివనామస్మరణతో కర్నూలు–గుంటూరు రహదారి మారుమ్రోగుతోంది. తలపై ఇరుముడి ధరించి శివనామాన్ని స్మరిస్తూ కాలినడకన శివయ్యదర్శనం కోసం వడివడిగా అడుగులు వేసుకుంటూ శివభక్తులు శ్రీశైలం వైపు సాగిపోతున్నారు. కర్ణాటక, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, తదితర ప్రాంతాల నుంచి వస్తున్న శివభక్తుల ఆకలి, దప్పికలు తీర్చేందుకు నందికొట్కూరు సమీపంలో, మండ్లెం గ్రామశివారు, తంగడంచ గ్రామశివారు, జూపాడుబంగ్లా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, జూపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన శిబిరాలు ఏర్పాటు వారి సేవలో దాతలు తరిస్తున్నారు. అన్నదాన శిబిరాల వద్ద భిక్షను స్వీకరిస్తున్న శివస్వాములు అన్నదాతలను ఆశీర్వదించి ముందుకు సాగుతున్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభం


ప్రత్యేక అలంకణలో సీతారాముల విగ్రహాలు


ప్రారంభించిన సీతారామచంద్రాలయం

కొత్తపల్లి: మండల కేంద్రంలో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంగావరుణాయనం, గణపతి పూజ, స్వస్తీపుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణము, మాతృకా పూజనం, యాగశాల ప్రవేశం, కలశ స్థాపనం, నవగ్రహవాస్తు, సర్వతోభద్ర మండల ప్రధాన దేవతా ఆవాహన, ఆరాధనం, జప పారాయణ, అభిషేక అర్చన, మంగళహారతీ, తీర్థ ప్రసాద వితరణ ఆశీర్వాదం జరిగాయి. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, దీక్షాహోమం, గణపతి హోమం, జలాధివాసం, ప్రదోష అర్చన పూజ, జప, మంగళహారతి స్వస్తీ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఇరుముడితో శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర


ఇరుముడులతో శ్రీశైలానికి బయలు దేరుతున్న ఎదురుపాడు గ్రామ శివస్వాములు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన శివస్వాములు శుక్రవారం ఇరుముడులతో కాలినడకన శ్రీశైల మహా క్షేత్రానికి బయలుదేరారు. గ్రామంలోని శివాలయంలో పూజలు నిర్వహించుకుని పాదయాత్రగా బయలుదేరారు. శివస్వాములను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సాగనంపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సంప్రదాయ నృత్యంలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విశాఖపట్నానికి చెందిన కె.సునీత మణిపురి సంప్రదాయ నృత్యప్రదర్శన, కర్నూలుకు చెందిన పి.రవిప్రసాద్‌రాజా, భాగవతార్ వారి శివకల్యాణం, విజయవాడకు చెందిన కొదండరామయ్య వారి గాత్ర సంగీతం, మహబూబ్‌నగర్‌కు చెందిన సాయికృప కూచిపూడి కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యం, పెద్దదోర్నాలకు చెందిన భ్రమరాంబా నాట్య కళాసమితి వారి భూకైలాస్ నాటకం, విజయవాడకు చెందిన సాయిబాలాజీ నాట్య మండలి వారి మోహినీ విజయం నాటకం ప్రదర్శించారు.

అడవులను రక్షించుకుందాం


ప్రజలకు సూచనలిస్తున్న అటవీశాఖ అధికారులు

బండి ఆత్మకూరు: అడవులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీ క్షేత్రాధికారి జెడ్.నాసిర్ ఝూ సూచించారు. అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కళా జాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించరాదన్నారు. శివరాత్రి సందర్భంగా గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులు గుంపులుగా వెళ్లాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు తీసుకెళ్లరాదని సూచించారు. అడవికి నిప్పు పెట్టడం, జంతువులకు హాని కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుండ్ల బ్రహ్మేశ్వరం ఆలయ చైర్మన్ నారాయణ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు


నాటుసారా స్థావరాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: శ్రీశైలం మండలంలోని సున్నిపెంట సుగాలితండాకు తూర్పున మోకాళ్ల కురవ, మామిడిశిలా అటవీ ప్రాంతంలోని నాటుసారా స్థావరంపై దాడులు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐలు కిషోర్‌కుమార్, రామాంజులనాయక్ తెలిపారు. శుక్రవారం వారు పక్కా సమాచారంతో నాటుసారా స్థావరంపై దాడులు చేసి 2 వేల లీటర్ల నాటుసారా తయారీ బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలపై ఎప్పటికప్పుడు దాడులు చేసి పూర్తిగా అరికడతామన్నారు. ఎస్టీ కాలనీ కొత్తపేటలో రమావత్ బద్రునాయక్ నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమ మద్యం సరఫరా, నాటుసారా తయారు చేస్తుంటే 9390943271 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

న్యాయవాదుల నిరసన


ఆత్మకూరు కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ఆత్మకూరు: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఆత్మకూరు కోర్టు ఎదుట న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ న్యాయవాదులకు వ్యతిరేకంగా కేంద్రం బిల్లు తీసుకురావడం బాధాకరమన్నారు. నిరసన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవిందరెడ్డి, పుల్లారెడ్డి, గిరిరాజ్, కేశవరెడ్డి, నగేష్, సిద్ధిక్‌అహ్మద్, లక్ష్మీనారాయణ, మహబూబ్‌బాషా, ఆసిఫ్ ఆలీఖాన్, మాణిక్యరావు, బతుకులయ్య, నరసింహులు, హుసేన్, మాబు, మియా, చింతలయ్య, భాస్కర్, అంకిరాజు పాల్గొన్నారు.

నందికొట్కూరు: కేంద్రం తెచ్చిన యాక్ట్‌కు వ్యతిరేకంగా న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరాముడు, కార్యదర్శి వెంకటరమణ, న్యాయవాది భాస్కర్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు


వెలుగోడులో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు ప్రతినిధులు


జూపాడుబంగ్లాలో ఇంటర్వ్యూ చేస్తున్న ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ కిషోర్‌బాబు

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 455 మంది దరఖాస్తు చేసుకోగా 292 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు శ్రీకాంత్, మాధురి, అబ్దుల్ కరీం, రాముడు దారఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు.

➤ **ఆత్మకూరు:** బీసీ కార్పొరేషన్ల రుణాలకు ఎంపీడీఓ నాగభూషణంశెట్టి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 390 మంది దరఖాస్తు చేసుకోగా 150 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. కుల, ఆధార్, రేషన్ కార్డులను పరిశీలించామని, త్వరలోనే అర్హులైన లబ్ధిదారుల వివరాలను తెలియజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

➤ **మహానంది:** స్థానిక సచివాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, ఈఓఆర్డీ నాగేంద్రుడు, ఏపీజీబీ మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.

➤ **పాములపాడు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 511 మందికి గానూ 393 మంది మాత్రమే హాజరయ్యారు. బ్యాంకు అధికారులు దరఖాస్తు దారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, బ్యాంకు అధికారులు మలిక్ ఉసేన్, నందిత, రాముడు, క్రిష్ణమోహన్, తిమ్మప్ప, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

➤ **జూపాడుబంగ్లా:** ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 250 మంది హాజరైనట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు కిషోర్‌బాబు, చిరంజీవయ్యశ్రేష్ఠి, నందికొట్కూరు ఏడీబీ బ్యాంకు సిబ్బంది దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు.

➤ **పగిద్యాల:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రెండో రోజు సబ్సిడీ రుణాలకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ పాల్గొన్నారు.